

క్లుప్తంగా

జెడ్పీచైర్మన్ జన్మదిన వేడుకలు



ఎల్కతుర్తి: హనుమకొండ జెడ్పీచైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్ జన్మదినాన్ని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గొడిశాల సమ్మయ్యగౌడ్, ఎంపీపీ జక్కుల అనిత రమేష్, జెడ్పీటీసీ వంగ రవీందర్, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కడారి రాజు, వైస్ చైర్మన్ మునిగుడుప శేషగిరి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బూర్గుల రామారావు, మారుపాటి మహేందర్‌రెడ్డి, సాతూరి చంద్రమౌళి, జూపాక జడ్సన్ పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..



కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ మారెపెల్లి సుధీర్‌కుమార్ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎర్రబెల్లి దేవేందర్‌రావు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు, మాజీ జెడ్పీటీసీ మారెపెల్లి నవీన్‌కుమార్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు జక్కుల రాజు, వార్డు సభ్యులు మేడిపల్లి రమేష్, శ్రీధర్‌రావు, సంపత్, రాజమౌళి, రాంచందర్, తిరుపతి పాల్గొన్నారు.

కడియం పరామర్శ..



ఐనవోలు: మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన పిడుగు కొమురమ్మ ఇటీవల స్టేషన్ ఘణపూర్‌లో నిర్వహించిన ఎమ్మెల్సీ కడియం శ్రీహరి సభకు వెళ్లి రైలు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా బుధవారం ఎమ్మెల్సీ కడియం శ్రీహరి స్థానిక నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కొమురమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు అన్ని రకాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అలాగే గ్రామానికి చెందిన గండి లక్ష్మీతోపాటు పలువురు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సర్పంచ్ గండి మల్లికాంబ, నాయకులు తదితరులు ఉన్నారు.

గ్రీన్‌బోర్డు బహూకరణ



ఖిలా వరంగల్: ప్రభుత్వ పాఠశాల్లో అనుభవమైన ఉపాధ్యాయులతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని స్థానిక కార్పొరేటర్ సిద్ధం రాజు అన్నారు. వరంగల్ 39వ డివిజన్ కాశికుంట ప్రభుత్వ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆశాజ్యోతి ఎన్ఆర్ఐ ఫౌండేషన్ అందజేసిన రూ.35వేల విలువైన గ్రీన్ బోర్డులను కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. ఎస్ఎంసీ చైర్మన్ గౌతమి, పరమేశ్వర్, ఉపాధ్యాయులు అనిత, భిక్షపతి, టీవీ.అశోక్‌కుమార్, వాణి, మానస, పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ బయో టెక్నాలజీ విభాగం అధిపతిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శాస్త్రిని నియమిస్తూ కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేయగా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు విభాగం అధిపతిగా బాధ్యతలు నిర్వర్తించారు.

టై, బెల్టుల పంపిణీ

కరీమాబాద్: రంగశాయిపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందన బుధవారం టై, బెల్టులను పంపిణీ చేశారు. రంగశాయిపేటకు చెందిన తిరునహరి శ్రీధర్ తన తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు టై, బెల్టులు, ఐడీ కార్డులను పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఊటుకూరు అశోక్, తిరునహరి శ్రీధర్, శారద, శ్రవణ్‌కుమార్, ఉష, జ్యోతి, గౌతం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

పరకాల: జిల్లా వ్యాప్తంగా ముందస్తు రాఖీ పండుగ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. వివిధ పాఠశాలలు, విశ్వవిద్యాలయాల ఆధ్వర్యంలో రాఖీలు కట్టి అన్నా, చెల్లెళ్ల అనుబంధాన్ని చాటారు. అదే విధంగా పట్టణంలోని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో గురువారం రక్షాబంధన్ వేడుకలను నిర్వహించనున్నట్లు సెంటర్ నిర్వాహకురాలు బీ.కే స్నేహ, బీ.కే సాంబమూర్తి తెలిపారు. రక్షాబంధన్ సందర్భంగా ముందస్తుగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లోని ఎస్సై, కానిస్టేబుళ్లకు, సిబ్బందికి రాఖీలు కట్టి స్వీట్లు పంపిణీ చేశారు. బ్రహ్మకుమారి కేంద్రంలో జరిగే వేడుకల్లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు.

ఐనవోలు: మండలంలోని పున్నేలు గ్రామ సమీపంలో గల ఏకశిల సీబీఎస్ఈ అండ్ స్టేట్ స్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. సుమారు 2000 మంది విద్యార్థులతో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించినట్లు ఆ విద్యా సంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి తెలిపారు. రక్షాబంధన్ ప్రత్యేకతను విద్యార్థులకు వివరించామన్నారు. ఉపాధ్యాయులకు మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులకు బాలికలు రాఖీలు కట్టినట్లు తెలిపారు. వృక్షాలకు రాఖీలు కట్టి ప్రకృతిని కాపాడుకుంటామని విద్యార్థులు వాగ్దానం చేశారు. అనంతరం ఆట పాటలతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కనకదుర్గ వృద్ధాశ్రమంలో వృద్ధులకు, సేవకులకు, ఐనవోలు మల్లికార్జున స్వామి దేవస్థాన సిబ్బంది, రక్షక భటులకు విద్యార్థులు రాఖీలు కట్టారు. పాఠశాల అడ్మిన్ ఇన్‌చార్జ్ ఎండీ బాబా, వైస్ ప్రిన్సిపాల్ కూనూరు రవికిరణ్, స్టాఫ్ ఇన్‌చార్జ్‌లు, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

నడికూడ: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ సంపూర్ణ బుధవారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అన్నా, చెల్లెల రక్తసంబంధాన్ని గుర్తు చేసేది రాఖీ పండుగని అన్నారు. వినోద, కళావతి, ఆయాలు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఐనవోలు : వృద్ధులకు రాఖీలు కట్టి ఆశీర్వాదం తీసుకుంటున్న విద్యార్థినులు



పరకాల : ఎస్సైకి రాఖీ కట్టి స్వీటు అందజేస్తున్న స్నేహ



నడికూడ : అంగన్‌వాడీ కేంద్రంలో..

పైరవీలు లేకుండా 'దళితబంధు' అమలు చేయాలి

ఎల్కతుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల పైరవీలు లేకుండా అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్ ప్రభుత్వాన్ని కోరారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితబంధు దరఖాస్తు గడువును పొడగించాలని కోరారు. దళితబంధు పథకంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు రాజకీయపార్టీల జోక్యం లేకుండా పారదర్శకంగా కలెక్టర్ ఆధ్వర్యంలో దళితులందరికీ దళితబంధు వర్తింపజేయాలని అన్నారు. అర్హులందరికీ కొత్తరేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శనిగరపు రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు కొట్టెపాక రవి, నాయకులు విజయరత్నం, చుంచు కుమార్, ప్రభాకర్, సమ్మయ్య, హరికృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిమ్మల మనోహర్

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కమలాపూర్ : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎస్సై సీమా ఫర్హీన్ సూచించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ బాలికల విభాగంలో నిర్వహిస్తున్న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడా పోటీలు, ఎంపికలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తాను బాల్యం నుంచి ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు. మార్పు అనేది సహజమని, ఎంతోమంది మహిళలు అన్ని కష్టాలను తట్టుకుంటూ ఆర్మీ జవాన్లుగా ఎంపికై ధైర్య, సాహసాలు ప్రదర్శిస్తున్నారన్నారు. ముస్లిం కమ్యూనిటీకి చెందిన తాను పోలీస్ డిపార్ట్‌మెంట్‌లోకి వస్తానని అనుకోలేదని, పట్టుదలతో చదివి ఎస్సై ఉద్యోగం సాధించానని అన్నారు. విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరించి పట్టుదలతో ముందుకెళ్తే ఏదైనా సాధించవచ్చని అన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రఫుల్లాదేవి మాట్లాడుతూ గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని, బాలురులతో సమానంగా బాలికలు పోటీతత్వం కనబర్చాలని సూచించారు. అనంతరం మండల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు క్రీడాకారులతో కలిసి ఆటలు ఆడి ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పల్లవి, సర్పంచ్‌లు కట్కూరి విజయ తిరుపతిరెడ్డి, అంకతి సాంబయ్య, ఎంపీటీసీ పాక లక్ష్మీ, హెచ్‌ఎం పీడబ్ల్యూసీ పవన్‌కుమార్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దస్రు, మండల కార్యదర్శి రాజు, పీఈటీలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై సీమా ఫర్హీన్

శానిటేషన్‌ను మరింత మెరుగుపరుస్తాం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్



సంపత్‌రావు దంపతులను సన్మానిస్తున్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులు, అధికారులు

పరకాల: పట్టణంలో చేపట్టిన శానిటేషన్ పనులను మరింత మెరుగుపర్చడంతో పాటు ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నల్లాలను బిగించి నీటి సరఫరా అందించాల్సిన అవసరం ఉందని మున్సిపల్ పాలకవర్గ సభ్యులు అభిప్రాయపడ్డారు. మున్సిపల్ సమావేశమందిరంలో బుధవారం చైర్‌పర్సన్ సోదా అనిత అధ్యక్షతన అత్యవసర సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 16 ఎజెండా అంశాలను ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వీధుల్లో చెత్తా, చెదారం లేకుండా అన్ని చర్యలు చేపడుతామని, ఇంటింటికీ నల్లా ద్వారా నీటిని అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, కమిషనర్ శేషాంజన్‌స్వామి, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యుడు పాల్గొన్నారు.

బాధ్యతతో పనిచేస్తేనే గుర్తింపు

బాధ్యతాయుతంగా పనిచేస్తేనే ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత అన్నారు. మున్సిపాలిటీ కార్యాలయంలో బిల్‌కలెక్టర్‌గా పనిచేసిన సంపత్‌రావు ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా సంపత్‌రావు దంపతులను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులు, మున్సిపల్ అధికారులు, ఉద్యోగులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్యాలయంలో 21 ఏళ్ల పాటు బిల్‌కలెక్టర్‌గా పనిచేసిన ఆయన మర్యాద, గౌరవంగా మెదిలారని, ఆయన సేవలు ఎంతో మందికి మేలు చేశాయని అన్నారు. సంపత్‌రావు స్ఫూర్తితో మిగతా ఉద్యోగులు పనిచేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోదీ పాలనలోనే పేదలకు న్యాయం

పరకాల: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలోనే పేదందరికీ న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. గ్యాస్ సిలిండర్‌కు ధర రూ.400 సబ్సిడీ అందించడంతో పాటు రూ.200 తగ్గించినందుకు స్థానిక బస్టాండ్ కూడలిలో ఆ పార్టీ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి బుధవారం పాలభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమంపై చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. రైతుల పంట నష్టపరిహారం కోసం కేంద్రం ప్రవేశపెట్టిన ఫసల్ భీమా యోజన, నిరుపేదల వైద్యం కోసం దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకాన్ని తెలంగాణ రాష్ట్రంలో ఎందుకు అమలు చేయడం లేదో సీఎం కేసీఆర్ స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘోర పరాజయం పాలవుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పరకాల పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, పట్టణ ప్రధాన కార్యదర్శులు గాజుల నిరంజన్, కుక్కల విజయ్, పట్టణ ఇన్‌చార్జ్ మేకల రాజవీర్, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, రూరల్ అధ్యక్షుడు పుట్ట రవీందర్, నడికూడ మండల అధ్యక్షుడు గోగుల రాజిరెడ్డి, ఆత్మకూరు మండల అధ్యక్షుడు ఇర్సవడ్ల సదానందం తదితరులు పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఎమ్మెల్యే గండ్ర పాలనలో అభివృద్ధి శూన్యం

శాయంపేట : స్థానిక ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పాలనలో మండల అభివృద్ధి శూన్యంగా మారిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి విమర్శించారు. మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను బుధవారం ఆ పార్టీ మండల నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం బుచ్చిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో గెలిచిన ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసమే బీఆర్ఎస్ పార్టీలో చేరానని చెప్పి నాలుగు సంవత్సరాలు పూర్తి అయ్యిందన్నారు. కానీ ఇప్పటికీ మండలంలో అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. నేషనల్‌హైవేకు సమీపంలో ఉన్న ప్రతీ మండలం అభివృద్ధి చెందిందని, కానీ శాయంపేట మండలంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో డబుల్ రోడ్డు నిర్మాణం అసంపూర్తిగా చేపట్టారని, మురుగు నీరు పోవడానికి సైడ్ డ్రైయినేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో గ్రామస్తులకు ఇబ్బందులు తప్పడం లేదన్నారు. మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయలేదని, ఆత్మకూరు నుంచి శాయంపేట వరకు రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన నిరుపేదలకు సీఎం కేసీఆర్‌తో మాట్లాడి ఇళ్లు ఇప్పిస్తానని చెప్పిన ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సంవత్సరం గడుస్తున్నా హామీ నేరవేర్చలేదని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే రమణారెడ్డికి ప్రజల చేతితో ఓటమి తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిందం రవి, మారెపల్లి రవీందర్, వలీహైదర్ పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆపదలో 100కు ఫోన్ చేయాలి

శాయంపేట : విద్యార్థులు ఆపద సమయంలో 100కు ఫోన్ చేయాలని స్థానిక ఎస్సై దేవేందర్ సూచించారు. మండల కేంద్రంలోని నవోదయ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం షీ టీం, సైబర్ క్రైమ్, ఐటీ కేస్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఆపద సమయంలో 100 డయల్ చేయాలని సూచించారు. పోలీస్‌శాఖ ప్రతిక్షణం అప్రమత్తంగా ఉటుందని, 1930కి కాల్ చేస్తే షీ టీం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రతిఒక్కరూ సైబర్‌క్రైమ్‌పై అవగాహణ కలిగి ఉండాలని సూచించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన రక్షా బంధన్ వేడుకల్లో పాల్గొనగా ఎస్సైకి విద్యార్థినులు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల డైరెక్టర్ మామిడి అనురాధ, ప్రిన్సిపాల్ మామిడి పృథ్వీ, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై దేవేందర్

గొల్ల, కురుమల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి



గొర్రెలను అందజేస్తున్న సర్పంచ్ రవీందర్‌రావు

నడికూడ: రాష్ట్రంలోని గొల్ల, కురుమలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని సర్పంచ్ ఊర రవీందర్‌రావు అన్నారు. గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా మంజూరైన 6 యూనిట్లను బుధవారం లబ్ధిదారులకు అందించారు. ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదేశాల మేరకు గొర్రెలను పంపిణీ చేశామన్నారు. వెటర్నరీ డాక్టర్ బాలకృష్ణ, కుమార్, తిరుపతి, మల్లేష్ పాల్గొన్నారు.

సైడ్ బర్మ్ పనులు వెంటనే చేపట్టాలి

శాయంపేట : మండల కేంద్రం నుంచి జోగంపల్లి వరకు రూ. 1 కోటి 20 లక్షలతో బీటీరోడ్డు పనులు చేపట్టిన సదరు కాంట్రాక్టర్ రోడ్డు పక్కన సైడ్ బర్మ్ పనులు చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వెంటనే సైడ్ బర్మ్ పనులు చేపట్టాలని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా కార్యదర్శి వంగరి సాంబయ్య కోరారు. బుధవారం రోడ్డు పనులను పరిశీలించి మాట్లాడారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేశారని ఆరోపించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అనేక చోట్ల రోడ్డు పగుళ్లు తేలిందన్నారు. రోడ్డు పక్కన మొరం కూడా పోయకుండా చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. రమేష్, దాసరి రాజ్‌కుమార్, ఆడెపు అశోక్ పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన

కేయూ క్యాంపస్: జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల సందర్భంగా అవయవ దానంపై కాకతీయ యూనివర్సిటీ క్రీడా మైదానంలో తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.